మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



# జిల్లాలో సిటీ పోలీసు యాక్ట్ అమలు

### సిపి విజయ్‌కుమార్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈనెల 9 నుంచి 24 వరకు సిటీ పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని సీపీ విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తే ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. బందిల పేరిట వివిధ సంస్థలు, కార్యాలయాలను ముట్టడించే వారిపై ఒత్తిడి, బెదిరింపులకు గురిచేసేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు ప్రజలు సహకరించాలన్నారు. అలాగే కమిషనరేట్ పరిధిలో డిజె సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు ఉన్నాయన్నారు. నిబంధనలను ఉల్లంఘించి డిజె వినియోగిస్తే చట్ట పరంగా చర్యలు తప్పవన్నారు.

# రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం ప్రమాదకరం

### మెదక్ జిల్లా ఎస్‌పి శ్రీనివాసరావు

**మెదక్ టౌన్, నవంబర్ 7, ప్రభాతవార్త :** జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కొంతమంది రైతులు ధాన్యాన్ని రహదారులపై ఆరబెట్టడం వలన ఇరుకుగా మరి ప్రమాదాలు జరుగుతున్నాయి. అదేవిధంగా ధాన్యం చుట్టూ రాళ్లు పెట్టడం, బ్లాక్ పాలిథిన్ కవర్ల తో కప్పడం వలన రాత్రి వేళల్లో వాహనదారులు అవి గమనించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే కొన్ని చోట్ల ఈ విధంగా ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. రహదారులపై ధాన్యం అర బెట్టడం ప్రజల ప్రాణ భద్రతకు ముప్పు అని అన్నారు. కావున రైతులు గ్రామ పంచాయతీ ప్రాంగణాలు, ఖాళీ ప్రదేశాలు లేదా రహదారులకు దూరంగా ఉన్న సురక్షిత ప్రదేశాలను ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు.

# యావత్ భారతాన్ని ఏకం చేసిన 'వందేమాతరం'

### మెదక్ అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్‌టౌన్, నవంబరు 7, ప్రభాతవార్త:** మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు, ఏవో యూనస్, డీఈఓ రాధాకిషన్, డిఆర్‌డిఏ పిడి శ్రీనివాసరావు, సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఇతర జిల్లా అధికారులు సిబ్బందితో కలసి శుక్రవారం ఉదయం 10 గంటలకు 'వందేమాతరం' గీతాన్ని సామూహికంగా ఆలపించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యావత్ భారతాన్ని ఏకం చేసి భారతీయులందరిలో స్వాతంత్ర కాంక్షను రగిలించిన గీతం 'వందే మాతరం' అన్నారు. ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని పెంపొందించేందుకు, భారతదేశ చరిత్రలో వందే మాతరం గీతానికి గల ప్రాధాన్యతను చాటి చెప్పేందుకు వీలుగా చేపడుతున్న వందేమాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భరత జాతిని ఏకంచేసిన 'వందేమాతరం'

### సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**సంగారెడ్డి మున్సిపాలిటీ నవంబరు 7, ప్రభాతవార్త :** యావత్ భారత జాతిని ఏకం చేసి, భారతీయులందరిలో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిన గీతం 'వందేమాతరం' అని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. వందేమాతర గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం సంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో సామూహిక గీతాలాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గీతం చారిత్రాత్మక ప్రాధాన్యం సంతరించుకుందని, అది భారతీయులను ఒకే తాటిపైకి తీసుకువచ్చి స్వాతంత్ర్య సమరానికి ప్రేరణగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సామూహిక గీతాలాపన కార్యక్రమం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ఎయిడెడ్ మరియు ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఒకేసారి నిర్వహించబడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డిఆర్ఓ పద్మజారాణి, వివిధశాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# గిరిజన రైతును వేధించిన ఆర్ఐ బదిలీ

**పాపన్నపేట, నవంబరు 7, ప్రభాతవార్త :** ఇటీవల గిరిజన రైతును వేధింపులకు గురిచేసి పోలీస్‌స్టేషన్‌లో రాత్రి 9 గంటల వరకు కూర్చో బెట్టిన ఆర్ఐని మెదక్ కలెక్టరేట్ కు బదిలీ చేస్తూ సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు, ఇటీవల ఒక భూమి పట్టా విషయమై కాళ్లకు చెప్పులు అరిగేలా తిరిగి, వేసారిన ఒక గిరిజన రైతును దుర్భాషలాడాడు అంటూ పోలీసులకు అప్పగించి రాత్రి తొమ్మిది వరకు ఉంచిన విషయం తెలిసిందే, అప్పట్లో ఈ విషయం అన్ని పత్రికలలో వైరల్ గా మారింది, ఈ విషయాన్ని గిరిజన సంఘాలు, దళిత సంఘాలు అప్పట్లో తీవ్రంగా ఖండిస్తూ, ఆర్ ఐ పై చర్య తీసుకోవాల్సిందిగా డిమాండ్ సైతం చేశారు, ఇందుక స్పందించిన అధికారులు ఆరైని కలెక్టరేట్ కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు, ఇతడి స్థానంలో స్వామి నీ పాపన్నపేట ఆర్ఐ గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# సిఎం రేవంత్‌రెడ్డికి వినూత్నరీతిలో బర్త్‌డే గిఫ్ట్



ఆకుపై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రం వేసిన గుండు శివకుమార్

**నారాయణఖేడ్, నవంబరు 7 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నవంబర్ 8న 57వ ఏడాది లోకి అడుగుపెడుతున్నారు. సిఎం జన్మదిన సందర్భంగా ఆయనకు వినూత్నరీతిలో శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అందులో భాగంగా నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్ట్ గుండు శివ కుమార్ అశ్వత్థ పత్రాలపై, అరటి ఆకుపై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రాలను వేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

# గురుకుల జోనల్ క్రీడల్లో సత్తా చాటిన క్రీడాకారులు

**హత్నూర నవంబర్ 7, ప్రభాతవార్త:** సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు నిర్వహిస్తున్న బాలుర 11వ జోనల్ స్పోర్ట్స్ సంగారెడ్డి జిల్లా హత్నూరలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళాశాలలో గురువారం ఆరంభమయ్యాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ ఉమ్మడి మెదక్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఇందులో పాల్గొంటున్నారు. రెండవ రోజు శుక్రవారం జరిగిన ఫైనల్ పోటీలలో అండర్ 14 చెస్ క్రీడలో ఉప్పల్ పాఠశాల, క్యారమ్స్‌లో సింగూర్ పాఠశాల, అండర్ 19 క్యారమ్స్‌లో ఉప్పల్ పాఠశాల, చెస్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాలేజ్, హత్నూర విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించి ప్రథమలుగా నిలిచారు. వాలీబాల్ :అండర్ 14 లోషేక్పేట్‌పాఠశాల, అండర్ 17లో కొండాపూర్, అండర్ 19 సింగూర్ పాఠశాలలు సత్తా చాటి ప్రథమ విజేతలుగా నిలిచారు. హ్యాండ్ బాల్ పోటీలు... అండర్ 17లో కొండాపూర్ పాఠశాల, అండర్ 19లో హత్నూర బిఆర్ అంబేద్కర్ కాలేజ్ విద్యార్థులు ప్రథమ విజేతలుగా నిలిచారు. కబడ్డీలో..అండర్ 14 శామీర్‌పేట్ పాఠశాల. అండర్ 19లో సింగూర్ విద్యార్థులు మొదటి శ్రేణి క్రీడా కారులుగా నిలిచారు. టెన్నికాయిట్ క్రీడలో... అండర్ 19లో ఉప్పల్ పాఠశాల, అండర్ 17లో న్యాల్‌కల్ పాఠశాల, అండర్ 14లో శామీర్‌పేట పాఠశాల ప్రథమ బహుమతి పొందారు. బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో.. అండర్ 19 నల్లవాగు పాఠశాల, అండర్ 17లో శామీర్పేట్‌పాఠశాల, విజేతలయ్యారు. కోకోలో..అండర్ 19 సింగూర్ పాఠశాల అండర్ 17 న్యాల్కల్ పాఠశాల ప్రథములుగా నిలిచి సత్తా చాటారు. శనివారంతో క్రీడలు ముగియనున్నాయి



గెలుపొందిన క్రీడాకారులు

# 'భారతీయులను ఏకంచేసిన వందేమాతరం'

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో దేశంలోని అన్ని వర్గాలు, అన్నిప్రాంతాల ప్రజలను ఏకం చేయడంలో ముఖ్యపాత్ర పోషించింది వందేమాతర గీతం అని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. ప్రభుత్వ పిలుపుమేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో వందేమాతరం గీతం సామూహిక ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రిటిష్‌వారు భారతదేశంలోని ప్రజలను కులాలు, మతాలు, ప్రాంతాలవారీగా విభజించి పాలిస్తున్న సమయంలో 150 సంవత్సరాల క్రితం దేశంలోని కవులందరూ ప్రజలను ఏకంచేసే అనేక ప్రయత్నాలు చేశారని తెలిపారు. దీంట్లో భాగంగానే బంకించంద్ర చటర్జీ బెంగాలీలో అనందమట్ గ్రంథంలో వందేమాతరం గీతాన్ని రచించడం జరిగిందన్నారు. వందేమాతర గీతం అనాడు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులందరినీ ఏకం చేసి ఉత్తరం నుంచి దక్షిణం వరకు తూర్పు నుంచి పశ్చిమ వరకు దేశాన్ని సమైక్యం చేయడానికి ఉపయోగపడిందని బెంగాల్ విభజన సమయంలో జరిగిన వందేమాతరం ఉద్యమంతోపాటు స్వాతంత్ర్య ఉద్యమంలోని క్విట్ ఇండియా, దండి యాత్ర తదితర అన్ని ఉద్యమాలలో ముఖ్య నినాదంగా వందే మాతరం నిలిచిందన్నారు. మతాలు, భాషలు, ప్రాంతాలు వేరైనా అందరం భారతీయులం అనే భావాన్ని కలుగజేస్తూ స్ఫూర్తి నింపిన వందేమాతరం గీత ఔన్నత్యాన్ని, దేశ గౌరవాన్ని కాపాడుతూ దానిని రచించిన బంకించంద్ర చటర్జీని సన్మానిస్తూ భవిష్యత్ తరాలు వందేమాతరం గీతం గొప్ప తనాన్ని ఎప్పటికీ స్మరించేలా అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్, డిఆర్వో నాగరాజమ్మ, జిల్లా అధికారులు, వివిధశాఖల సిబ్బంది పాల్గొన్నారు.



వందేమాతర గీతం సామూహిక అలాపన చేస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు

### టిఆర్ఎస్ఎంఎ ఆధ్వర్యంలో

బంకించంద్ర చటర్జీ రచించిన అద్భుతమైన వందేమాతర గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్(టిఆర్ఎస్ఎంఎ) ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యం ఆధ్వర్యంలో వందేమాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీ విజయ్‌కుమార్ పాల్గొని విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాలాపన అలపించారు.



ఆర్‌డిఓకు వినతి పత్రం అందచేస్తున్న కార్మికులు

# మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు అందించాలి

### సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్

**జహీరాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజనం కార్మికు లకు బకాయి వేతనాలు చెల్లించడంతోపాటు ప్రతి నెల వేతనాలు అందచేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నాకు పూనుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం వండేది పేద కార్మికులని, పేదలకు ప్రతి నెల జీతాలు అందకుంటే వారు తమ కుటుంబాన్ని ఎలా పోషిస్తారన్నారు. కుటుంబ పాలన సాగదని తెలిసినా అధికారులు ప్రతి నెల జీతాలు అందించకుంటే ఎలా అని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజనం వండేందుకు కార్మికులు సరుకులను తెచ్చేందుకు తమ బంగారు ఆభరణాలను కుదువకు పెట్టాల్సి వస్తోందని ఆగ్ర హం వ్యక్తంచేశారు. కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందిచకపోవడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెడుతున్న కార్మికులు మాత్రం తమ కుటుంబ సభ్యులతో పస్తులుం డాల్సిన దయనీయ దుస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు బకాయి వేతనాలు అందించడంతో పాటు రానున్నరోజుల్లో ప్రతి మాసం వేతనాలు అందేలా చూడాలని, ప్రభుత్వం స్పందించకుంటే తమ ఆందోళనను తీవ్ర తరం చేస్తామని మహిపాల్ హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సావిత్రమ్మ, పుష్ప, లక్ష్మమ్మ, కష్టమ్మ, సుగుణమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

# పత్తి రైతులను ఇబ్బంది పెట్టొద్దు

### సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

**సిద్దిపేట అర్బన్, నవంబరు 7, ప్రభాతవార్త :** పత్తి రైతులకు ఎలాంటి షరతులు లేకుండా పాత పద్దతిలో సీసీఐ కొనుగోళ్లు చేపట్టాలని..రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న కపాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా కలెక్టర్ హైమావతిని కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేసి మాట్లాడారు. భారీ వర్షాలతో పత్తి పంట దెబ్బతినడంతో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని అమ్మడానికి తేస్తే ఇబ్బందులు తప్పడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన కపాస్ యాప్ ద్వారా రైతులు స్మార్ట్ ఫోన్‌లో ఒక రోజు ముందు స్లాట్ బుక్ చేసుకోవాలని గతంలో ఎకరానికి 12 క్వింటాళ్లు కొనుగోలు చేసిన సీసీఐ ఈ సారి 7 క్వింటాళ్లకు కుదించడం సరికాదన్నారు. తేమ శాతం 12 నుంచి 20 శాతానికి పెంచాలని రైతులను ఇబ్బందులకు గురి చేసే అంక్షలు తొలిగించాలన్నారు. కపాస్ యాప్‌ను ఎత్తివేసి నేరుగా పాత పద్ధతితోనే పత్తిని కొనుగోలు చేయాలని కలెక్టర్‌కు వివరించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని సీసీఐ కేంద్రాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తామని కలెక్టర్ చెప్పినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జేరిపోతుల జనార్ధన్ ఉన్నారు.

# రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

### రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



రైతులతో మాట్లాడుతూన్న బక్కి వెంకటయ్య

**దుబ్బాక,(అక్బర్‌పేట భూంపల్లి), నవంబరు 7, ప్రభాతవార్త :** తాళ్లపల్లి గ్రామ రైతులకు ధాన్యం విక్రయం కోసం, రోడ్డు సమస్య పట్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం అని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య దృష్టికి తీసుకు రాగా, వెంటనే స్పందించి సంబంధిత అధికారులను పిలిచి రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించారు. అలాగే రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించి పనులను పూర్తిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోతరెడ్డి లో గల విద్యార్థులకు మోలిక వసతులు, నీట సదుపాయాల సమస్యల పట్ల పనులను త్వరగ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రిజ్వాన్, టేకులపల్లి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ గొడుగుపల్లి లక్ష్మి ం ఎల్లయ్య, బొడోళ్ళ దేవరాజు, టేకులపల్లి జైపాల్ రెడ్డి, వేల్పుల నర్సింలు, గోపరి చిన్న నర్సింలు, గోపరి బాలయ్య, పెద్దోళ్ల సిద్దయ్య, వేల్పుల నర్సింలు, ఎంకమొల్ల ఎల్లయ్య, సందిల రాజం, గోద దేవయ్య, గోద గంగయ్య, బొమ్మరపు ఎల్లం, గ్రామ రైతులు, ప్రజలు, తదితరులు ఉన్నారు.

# జాతీయ గీతంతో దేశభక్తి, ఐక్యతభావాలు బలపడతాయి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ నవంబర్ 7, ప్రభాతవార్త:** జాతీయ గీతాన్ని మహాకవి బంకిమ్ చంద్ర ఛటర్జీ రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సామూహిక గీతాలాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ముఖ్యఅతిథిగా పాల్గొని, విద్యార్థులతో కలిసిగీమ వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వందేమాతరం గేయంలోని ప్రతి పదం దేశభక్తి భావనతో నిండి, భారత దేశం ఒకటే అని గర్వంగా చెబుతుందన్నారు. ఈ గీతం దేశ ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని, ప్రతి విద్యార్థి ఈ భావనను మనసులో నిలుపుకోవాలని సూచించారు. అలాగే ప్రతిరోజూ పాఠశాలలో వందేమాతరం గేయాన్ని ఆలపించడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, ఐక్యత భావాలు మరింత బలపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు ఈ గీతం ద్వారా దేశసేవా స్ఫూర్తిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. వందేమాతరం గేయం ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందని, దేశ చరిత్రలో ఈ గేయం విశేష ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

### పాఠశాలలో పారిశుధ్య సమస్యపై కలెక్టర్ ఆగ్రహం

### ప్రధానోపాధ్యాయురాలిని సస్పెండ్ చేయాలని ఆదేశం

**సంగారెడ్డి మున్సిపాలిటీ నవంబర్7, ప్రభాతవార్త:** పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పారిశుధ్య సమస్యపై కలెక్టర్ ప్రావీణ్య ప్రధానోపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్య సంగారెడ్డి బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీచేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో శానిటేషన్ సమస్య, ఎఫ్ఆర్ఎస్ సిస్టం సరిగా అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూత్రశాలలు మరుగుదొడ్లను పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండడంతోపాటు, పాఠశాలలో శానిటేషన్ సమస్య కలెక్టర్ దృష్టికి రావడంతో ప్రధానోపాధ్యాయురాలు రోజాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్రధానో పాధ్యాయురాలిని సస్పెన్షన్ చేయాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లును ఆదేశించారు. శానిటేషన్ సిబ్బందిని తొలగించి నూతన సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. అనంతరం తరగతి గదులను సందర్శించారు. ఎఫ్ఆర్ఎస్ సిస్టం పూర్తిస్థాయిలో అమలు అయ్యేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. రానున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణులు అయ్యేలా ఇప్పటి నుండే ఉపాధ్యాయులు, ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలో విద్యాప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు సిబ్బంది కృషి చేయాలని ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న చాడ వెంకటరెడ్డి

# అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహం ప్రతిష్ఠించాలి

### సిపిఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 7, ప్రభాతవార్త:** జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా హుస్నాబాద్‌లోని డిపో క్రాస్ వద్ద 2012లో ఏర్పాటు చేసిన అమరవీరుడు అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహాన్ని తొలగించిన అధికారులు పనులు పూర్తైన నేపథ్యంలో వెంటనే తిరిగి ఆ విగ్రహాన్ని అదే చౌరస్తాలో ప్రతిష్ఠించాలని కోరుతూ శుక్రవారం సిపిఐ పార్టీ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తమ పార్టీ శ్రేణులతో కలిసి హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనభేరి ప్రభాకర్‌రావు తెలంగాణ సాయుధ పోరాట యోధుడని, హుస్నాబాద్ మండలంలోని మహ్మదపుర్ గ్రామంలో నిజాం నవాబుల పాలనను ఎదిరించి రజాకార్ల, రాక్షస పాలన నుండి ప్రజలను విముక్తి చేయడంలో అసువులు బాసారని గుర్తు చేశారు. ప్రభాకర్ రావు విగ్రహాన్ని 2012 సంవత్సరంలో అప్పటి మాజీ ఎమ్మెల్యేగా ఉన్న తన ఆధ్వర్యంలోనే అప్పటి ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, ప్రస్తుత హుస్నాబాద్ నుంచి ప్రాతినిధ్యం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కరీంనగర్ పార్లమెంటు సభ్యులుగా ఉన్న సందర్భంగా అనభేరి ప్రభాకర్ రావు విగ్రహం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ సిపిఐ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ,సిద్దిపేట సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజివరెడ్డి, హుస్నాబాద్ సిపిఐ మండల సహాయ కార్యదర్శి పోదిల కుమారస్వామి, నాయకులు బత్తుల బాబు, అయిలేని మల్లారెడ్డి పాల్గొన్నారు.

# కడవేర్గు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

**చేర్యాల, నవంబరు 7,ప్రభాతవార్త :** చేర్యాల నుండి కడవేర్గు, నాగపురి రహదారి పూర్తిగా గుంతలమయం, కోతలకు గురికావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అన్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని మరమ్మతులు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఈరి భూమయ్య, వలబోజు నర్సింహాచారి, నంగి కరుణాకర్, నర్సిరెడ్డి ఉన్నారు.

# ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ..డ్రైవర్ మృతి

**ములుగు, నవంబరు 7 (ప్రభాతవార్త):** ఆగిఉన్న లారీని వెనుకనుంచి మరో లారీ ఢీకొనట్టడంతో డ్రైవర్ మృతిచెందిన సంఘటన ములుగు రాజీవ్ రహదారిపై శుక్రవారం జరిగింది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం... సికింద్రాబాద్‌లోని ఓల్డ్‌బోయిన్‌పల్లికి చెందిన హరిసింగ్(44) లారీలో ఛత్తీస్‌ఘడ్ నుండి ఐరన్ పైపుల లోడుతో సికింద్రాబాద్‌కు వెళుతుండగా మార్గమధ్యలో ములుగు రాజీవ్ రహదారిపై ఆగివున్న మరో లారీని వెనుక నుండి ఢీకొట్టాడు. దీంతో హరిసింగ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

# విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి



మృతి చెందిన పాడి గేదె

**సిద్దిపేట అర్బన్, నవంబరు 7, ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లకు తగిలి పాడి గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఎన్సాన్‌పల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు సురేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పంట పొలం పరిసర ప్రాంతాలలో గేదెలను మేపడానికి తీసుకెళ్లగా పొదలో తెగిపడిన విద్యుత్ వైర్లకు తగిలి గేదె మృతి చెందినట్లు తెలిపారు. రూ.85 వేల నష్టం జరిగినట్లు బాధితుడు సురేష్ తెలిపారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఐదుగురికి రూ.32వేల జరిమానా

### -ఇద్దరికి 4 రోజుల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా

**గజ్వేల్ టౌన్, నవంబరు 7 (ప్రభాతవార్త):** మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి రూ.32వేల జరిమానా విధించగా, ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించడం జరిగిందని ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో కొన్ని రోజులుగా సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించగా మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా ఐదుగురికి బ్రీత్ ఎనలైజర్ చేయగా మద్యం తాగిఉన్నట్లు రిపోర్టు రావడంతో శుక్రవారం వారిని గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరచగా విచారణ చేసి ఐదుగురికి రూ.32వేల జరిమానా విధించారని, మరో ఇద్దరికి నాలుగు రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

# ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

**పాపన్నపేట, నవంబర్ 7, ప్రభాతవార్త:** ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్ లారీని పోలీసులు పట్టుకొని పాపన్నపేట పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. గురువారం రాత్రి సమయంలో మెదక్ మండల పరిధిలోని మల్కాపూర్ గిరిజన ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారంమేరకు గస్తీ నిర్వహిస్తున్న క్రమంలో కుర్తివాడ గ్రామానికి ఇసుకతోకూడిన టిప్పర్ లారీ వస్తుండడంతో తనిఖీ చేపట్టగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తూ ఉండడంతో లారీని పట్టుకొని పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. నిబంధనలను అతిక్రమించిన ఇసుక రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




అక్రమ ఇసుకను తరలిస్తున్న టిప్పర్

## ప్రజాసమస్యలను పరిష్కరించకుంటే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

**-బిజెవైఎం రాష్ట్ర నాయకులు తాటికొండ శ్రీనివాస్**



వినతిపత్రం అందజేస్తున్న బిజెవైఎం నాయకులు శ్రీనివాస్

**సిద్దిపేట అర్బన్, నవంబరు 7, ప్రభాతవార్త:**
సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపల్లిలో ప్రజా సమస్యలను పాలకవర్గం, అధికారులు పట్టించుకున్న పాపానపోలేదని బిజెవైఎం నాయకులు తాటికొండ శ్రీనివాస్ అన్నారు. 1వ వార్డు లింగారెడ్డిపల్లిలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వార్డులో గత కొన్ని యేళ్ల నుంచి వీధిదీపాలు వెలగడం లేదన్నారు. ఎల్లమ్మగుడి నుంచి ఇందిరమ్మ కాలనీ మీదుగా లింగారెడ్డిపల్లి వరకు వీధిదీపాలు వెలగక పోవడంతో రాత్రివేళల్లో ప్రయాణీకులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అమృత్ పథకం కింద మున్సిపాలిటీకి వందల కోట్ల నిధులు వస్తున్నా, లింగారెడ్డిపల్లిలో మాత్రం కనీసం వీధిదీపాలు ఏర్పాటుచేయడం లేదన్నారు. 1వవార్డుపై పూర్తిగా వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాహనాదారులు కిందపడిపోతూ గాయలకు గురవుతున్నారని తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేయించాలన్నారు. 1వవార్డులో నెల కొన్న ప్రజా సమస్యలను పరిష్కరించకుంటే ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తాటికొండ లక్ష్మణ్, నక్కల రాజు, ఆకారం విజయ్, చిట్టి సంజయ్‌రెడ్డి, ప్రసాద్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## లిఖిత రామనామాలతో శ్రీసీతారామచంద్రులకు అభిషేకం



శ్రీసీతారామచంద్రస్వామికి పూజలు చేస్తున్న రామరాజు

**గజ్వేల్ టౌన్, నవంబరు 7 (ప్రభాతవార్త):**
కార్తీకమాసం సందర్భంగా శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం 11కోట్ల లిఖిత రామనామాలతో అద్దాల మందిరంలో కొలువైన శ్రీసీతారామచంద్రుల వారికి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు ప్రత్యేకంగా అభిషేకించి పూజించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ కార్తీకమాసం శివకేశవులకు శ్రేష్టమైన మాసం అన్నారు. రామనామ స్మరణ చేస్తే ఆనందం లభిస్తుందని, ఆ నామంలో ఉన్న మంత్రశక్తి మనలో దుఃఖాలను సమూలంగా నాశనం చేసి ఆనందాన్ని ఇస్తుందన్నారు. రామ నామాన్ని లిఖించి తరించాలనుకునే వారు రామకోటి కార్యాలయంలో రామకోటి పుస్తకాన్ని తీసుకోవాలన్నారు.

## నాచగిరిలో వైభవంగా కార్తీక దీపోత్సవం



కార్తీక దీపాలు వెలిగించి స్వామివారికి పూజలు చేస్తున్న దృశ్యం

**వర్గల్, నవంబరు 7, ప్రభాతవార్త:**
నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ్మాస్వామి క్షేత్రంలో కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసంలో 17వ రోజు అయిన శుక్రవారం నాచగిరి క్షేత్రంలో విశేష పూజలు నిర్వహించడంతో పాటు సాయంత్రం భక్తులు దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ దీపోత్సవ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనగా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లుచేశారు.

## కులాంతర వివాహాలు చేసుకున్నవారికి రక్షణగా చట్టం చేయాలి

**సైఫాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:**
కులాంతర, మతాంతర పెళ్ళిళ్లు చేసుకున్నవారికి రక్షణ కల్పిస్తూ ప్రభుత్వాలు చట్టాలు తీసుకురావాలని కోరుతూ ఈ నెల 9వ తేదీన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని చయాన్ నెట్‌వర్క్, కుల నిర్మూలన సంఘం, మానవ వికాస వేదిక, కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం, జన విజ్ఞాన వేదిక, మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం తెలిపాయి. శుక్రవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘాల ప్రతినిధులు ఎం.డి.వాహిద్, అసీఫ్ ఎగ్బాల్, స్వరాజ్యలక్ష్మి, సూర్యనారాయణరావు, స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ ఈసదస్సులో ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పాల్గొంటారని, గౌరవ అతిథులుగా జస్టిస్ టి.రజని, జస్టిస్ డా.జి.రాధారాణి, జస్టిస్ చంద్రయ్య, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ప్రముఖ గాయని విమలక్క తదితరులు పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి కళ్యాణమండపం నుంచి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు కులాంతర వివాహాలు చేసుకున్న జంటలు ర్యాలీ నిర్వహిస్తారని చెప్పారు.

## 16న 'స్ఫూర్తి బాలల పత్రిభోత్సవం-2025'

**సైఫాబాద్, నవంబరు 7, ప్రభాతవార్త:**
బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలబాలికల్లో దాగి ఉన్న సంగీతం, నృత్యం, మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, సోలో, డ్యూయేట్, డబుల్స్, గ్రూప్స్, మిమిక్రి, మ్యూజిక్, ఏకపాత్రాభినయం, కరాటే, కుంగ్‌ఫు తదితర స్టేజి పెర్‌ఫామింగ్ ఆర్ట్స్‌లలో ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఈనెల 16న 'స్ఫూర్తి బాలల నప్రతిభోత్సవం-2025' నిర్వహిస్తున్నామని స్ఫూర్తి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడెమీ తెలిపింది. ఈ నెల 16వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని, 4 సంవత్సరాల నుంచి 16ఏళ్ళ లోపువారు ఈ పోటీలకు అర్హులని, పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికేట్‌తోపాటు గోల్డ్ మేడల్ (గోల్డ్ కోటేడ్) మెమోంటో బహుకరిస్తామని తెలంగాణ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణఆదిశేషు, ప్రముఖ నాట్యగురువు ప్రతిభ, రాజుగౌడ్, సలహాదారు లయన్ పవన్, కోటేశ్వర్‌రావు శుక్రవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చెప్పారు. పూర్తి వివరాలకు 7893940600లో సంప్రదించి పేర్లును నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

# జాతీయ న్యాయసేవ దినోత్సవం

**-పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి ఎం.హేమలత**




జాతీయ న్యాయసేవ దినోత్సవంలో ప్రసంగిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ఎం.హేమలత తదితరులు

**నర్సాపూర్, నవంబరు 7, ప్రభాతవార్త:**
మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ న్యాయసేవ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి జూనియర్ సివిల్ జడ్జ్, చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ న్యాయమూర్తి ఎం.హేమలత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా న్యాయమూర్తి ఎం.హేమలత జాతీయ న్యాయసేవ అధికార సంస్థ ద్వారా ప్రజలందరికీ సమన్యాయం అందించాలని పేర్కొంటూ, జాతీయ న్యాయసేవ దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. జాతీయ, తెలంగాణ రాష్ట్ర, మెదక్ జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో కోర్టు హాల్లో జాతీయ న్యాయసేవల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎం.హేమలత జాతీయ న్యాయసేవల దినోత్సవాన్ని పురస్కరించుకొని మాట్లాడుతూ సుప్రీంకోర్టు, హైకోర్టు, ద్వారా జాతీయ న్యాయసేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ ద్వారా భారతదేశంలో భారతరాజ్యాంగం ద్వారా సంక్రమించిన న్యాయ వ్యవస్థ ద్వారా ప్రజలందరికీ సముచిత న్యాయాన్ని అందించడం జరుగుతుందన్నారు. నిరుపేద కుటుంబాలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందించడానికి గ్రామీణప్రాంతాలలో ప్రతి ఒక్కరికి చట్టాల పైన అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయసేవ అధికార సంస్థ సేవలను అభివర్ణిస్తూ న్యాయమూర్తి ప్రసంగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జ్, కోర్టు ఎజిపి పి.సుధాకర్, నర్సాపూర్ సబ్‌ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎ.రంజిత్‌రెడ్డి, ఎక్సైజ్ సబ్‌ఇన్స్పెక్టర్ బి.అరుణ, కోర్టు సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, లీగల్ సర్వీస్ న్యాయవాది సి.హెచ్, స్వరూపరాణి, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్ మధుశ్రీశర్మ, సీనియర్ న్యాయవాదులు ఎ.అంజిరెడ్డి, ఎండి జాఫర్, ఎండి ఖాజా మోయినొద్దీన్, న్యాయవాదులు కె.ప్రకాష్, కెవి.శ్రీనివాస్‌రావు, ఎ.శ్రీనివాస్, ప్రభాకర్, జర్పుల రాజునాయక్, కె.నాగరాజు, ఎండి ఆరిఫ్, సాయిరాం, రవినాయక్, వివిధ గ్రామాల ప్రజలు, లీగల్ సర్వీస్ కోర్టుసిబ్బంది పాల్గొనడం జరిగింది.

## బాల్యవివాహరహిత జిల్లాగా ప్రకటిద్దాం

**-ఐసిడిఎస్. సిడిపిఓ స్వరూప**



సమావేశ మందిరంలో మాట్లాడుతున్న సిడిపిఓ స్వరూప తదితరులు

**వెల్దుర్తి, నవంబరు 7, ప్రభాతవార్త:**
మెదక్ జిల్లాను బాల్యవివాహరహిత జిల్లాగా ప్రకటించాలని అందుకు అందరూ కలిసి బాల్యవివాహ నిర్మూలన చేపట్టాలని ఐసిడిఎస్ సిడిపిఓ స్వరూప అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఎంపిడివో కార్యాలయ సమావేశమందిరంలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలన. ఆడపిల్లల రక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో స్థానిక ఇన్చార్జ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడివో ఉమాదేవి, ఎంఈఓ సీతారాం, వైద్యాధికారి సౌజన్య, స్థానిక పోలీసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల, గ్రామాల్లో జరిగే బాల్యవివాహాలను నిర్మూలించాలని అందుకు అందరూ ఐకమత్యంగా ఉండి నిర్మూలనకు సిద్ధంగా ఉండాలన్నారు.

## ఎక్సైజ్ కార్యాలయంలో వందేమాతరం



వందేమాతరం గీతాలాపన చేస్తున్న ఎక్సైజ్ సిఐ గులాం ముస్తఫా

**నర్సాపూర్, నవంబరు 7, ప్రభాతవార్త:**
శుక్రవారం నర్సాపూర్ ఎక్సైస్ కార్యాలయ ఆవరణలో ఎక్సైజ్ సిఐ గులామ్ ముస్తఫా ఆధ్వర్యంలో సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎక్సైజ్ సిఐ గులాం ముస్తఫా మాట్లాడుతూ డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఎక్సైజ్‌శాఖ స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నామని అన్నారు. ముఖ్యంగా రాజస్థాన్ రాష్ట్రంనుంచి తెలంగాణకు వలసవస్తున్న కార్మికులు అక్కడినుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చి తెలంగాణరాష్ట్రంలోని పలుజిల్లాలలో విక్రయిస్తున్నారన్నారు. గంజాయిని విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ గులాం ముస్తఫాతోపాటు ఎక్సైజ్ ఎస్ఐలు రాఘవేందర్, అజీజ్, ఆరుణ, సిబ్బంది రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ఇంటింటా ప్రచారం

**-మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి**



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న చిలుముల సుహాసినిరెడ్డి

**నర్సాపూర్, నవంబరు 7, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపే లక్ష్యంగా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నట్లు మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి అన్నారు. శుక్రవారం హైద్రాబాద్‌లో జరుగుతున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపుకు పార్టీ నాయకులతో కలిసి రహమత్‌నగర్ డివిజన్‌లో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో సరిత తిరుపతయ్య, గిరిజాషెట్కార్, స్థానిక మహిళానేతలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రంలో తూకం ప్రారంభం



కొనుగోలు కేంద్రంలో తూకం ప్రారంభించిన అధికారులు

**వెల్దుర్తి, నవంబరు 7, ప్రభాతవార్త:**
మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామంలో ఇటీవల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రెండురోజుల క్రితం కొనుగోలు ఇన్చార్జిపై రైతులు దాడి చేయడంతో కేంద్రాన్ని మూసివేశారు. శుక్రవారం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు కేంద్రాన్ని మూసివేయడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న స్థానిక రెవిన్యూ ఇన్స్పెక్టర్ నర్సింగ్‌యాదవ్, పిఎసిఎస్ సిఈవో అశోక్‌లు కొనుగోలు కేంద్రం వద్దకు చేరుకొని కొనుగోలు ఇంచార్జికి నచ్చజెప్పి మళ్లీ తూకం ప్రారంభించారు. అక్కడున్న రైతులకు అధికారులు నచ్చచెప్పడంతో తిరిగి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు.

## విజయవంతంగా మెగా పశువైద్య శిబిరం

**-పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డా.గోపి**

**అత్తాపూర్ నవంబరు 7, ప్రభాతవార్త:**
పివి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, పశువైద్య జీవ సాంకేతిక విజ్ఞానశాస్త్ర విభాగం, భారత పశువైద్య మండలి మంజూరు చేసిన పరిశోధన పథకంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని ప్రాథమికపశువైద్యశాల, జూలూరు, కాత్రాయిపల్లి, పెద్దగూడెం గ్రామాలలో మెగా పశువైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డా.గోపి, ఐఎఎస్ హాజరై ప్రాణాంతక వ్యాధుల నివారణకు పశువులకు టీకాలు వేయడం ఎంత ముఖ్యమో వివరించారు. విశ్వవిద్యాలయం గ్రామాలను దత్తత తీసుకోవాలన్న ప్రతిపాదనపై స్పందిస్తూ ఇది చాలా మంచి ఆలోచన అని అభినందించారు. అలాగే పశువుల మేత విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలియజేసి, రైతులు వాటిని ఉపయోగించి పశుగ్రాసాల సాగును చేపట్టాలని సూచించారు. కార్యక్రమం ముగింపులో రైతులకు వారి పశువులకోసం ఔషధాలు, నేపియర్ గడ్డి మొక్కలు పంపిణీచేశారు. ఈసందర్భంగా జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డా.జానయ్య రైతులు అనుసరిస్తున్న మంచినిర్వహణ పద్ధతులను ప్రశంసిస్తూ, ఈప్రాంతంలో పప్పుజాతి పశుగ్రాసాలను మేతలో అందించకపోవడం వల్ల పశువులలో పోషకలోపాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ ఫ్యాకల్టీస్, డా.ఉదయ్‌కుమార్, ముఖ్యఅతిథికి కృతజ్ఞతలు తెలుపుతూ పశువుల గర్భాశయ సంబంధిత సమస్యలపై రైతులకు అవగాహనకల్పించారు. పశువుల గర్భాశయం చాలా సున్నితమైనదని పేర్కొని రైతులు విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్ల సలహాలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్, డా.మాధురి సభలో పాల్గొన్న అందరికీ స్వాగతం పలికారు. భవిష్యత్తులో ఈ గ్రామాన్ని దత్తత తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి డా. రమణరెడ్డి స్వదేశీ జాతుల పశువుల పెంపకంపై రైతుల్లో పెరుగుతున్న ఆసక్తిని అలాగే యువత వ్యవసాయం, పశుపోషణ రంగంలోకి అడుగుపెడుతున్న సానుకూల మార్పును ప్రస్తావించారు. ఈశిబిరంలో విశ్వవిద్యాలయానికి చెందిన వివిధ విభాగాల ప్రొఫెసర్లు, జూనియర్ డాక్టర్లు, పిజి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శిబిరంద్వారా రైతులకు వివిధపశువైద్యసేవలు అందించబడినాయి. జూలూరు, కాత్రాయిపల్లి, పెద్దగూడెం గ్రామాలతోకలిపి మొత్తం 354జంతువులకు సేవలను అందించారు. వాటిలో 191జంతువులకు క్రిమినాశక మందులు వేయబడగా, 6కృత్రిమ గర్భధారణలు చేయబడ్డాయి. అదేవిధంగా 42 గర్భ నిర్ధారణలు నిర్వహించబడినాయి. 6శస్త్రచికిత్సలు చేయబడ్డాయి. ఇతర రోగాల చికిత్సలకింద మొత్తం 90జంతువులకు వివిధ వైద్యసేవలు అందించబడినాయి. అదనంగా, జూలూరు గ్రామంలో 19జంతువులకు ఎఫ్‌ఎండి టీకాలు వేశారు.

## స్వాతంత్ర ఉద్యమంలో వందేమాతరం గేయం కీలకం

**అత్తాపూర్ నవంబరు 7, ప్రభాతవార్త:**
వందేమాతరం గేయానికి 150సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ ఆధ్వర్యంలో గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ, బంకిమ్‌చంద్ర చటర్జీ రాసిన ఈగేయం స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకంగా మారిందని అదేవిధంగా 150సంవత్సరాలు అయిన సందర్భంగా భారత ప్రధాని నరేంద్రమోడీ పిలుపుమేరకు గీతలాపన కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా సెక్రెటరీ కొమురయ్య, విజయ్‌కుమార్, రాజు, కిరణ్‌చారి, మణికంఠ, అనురాధ, హరినాథ్, మల్లేశ్‌చారి, పి.సుధాకర్‌రెడ్డి, పుల్లారెడ్డి వరదరాజురెడ్డి, జనార్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌చారి, సాయియాదవ్, సహదేవరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, సతీష్, సోల్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వందేమాతరం

**అత్తాపూర్ నవంబరు 7, ప్రభాతవార్త:**
వందేమాతరం వేడుకలు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలనభవనంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. బంకిం చంద్ర చటర్జీ రాసిన వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన ఈ వేడుకల్లో విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతరసిబ్బంది పాల్గొని సామూహికంగా వందేమాతరగీతాన్ని ఆలపించారు. ఈసందర్భంగా వందేమాతర గీతం ప్రాముఖ్యాన్ని తెలిపి, స్వాతంత్ర్య సమరంలో ఈగీతం జాతిని జాగృతం చేసిన చరిత్రని రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ వివరించారు.

## వేణుమాధవ్, పట్టాభిరామ్‌లు అజరామరులు

**-ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్**

**రవీంద్రభారతి, నవంబరు 7 ప్రభాతవార్త:**
నేరెళ్ల వేణుమాధవ్ ప్రపంచఖ్యాతిగాంచిన మిమిక్రీ కళాకారుడని, ఆయన భారతీయుడు. అందులోనూ తెలుగువాడవ్వడం మన అదృష్టమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. బహుభాషల్లో మిమిక్రీ ప్రదర్శించడం, పద్మశ్రీ, కళాప్రపూర్ణ తదితర ప్రతిష్ఠాత్మక అవార్డులు పొందడం, అన్నింటికీ మించి తిరుమలలో స్వామివారిముందు గజారోహణం పొందడం వారి ఉన్నతశిఖరాల అధిరోహణలకు తార్కాణమన్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలో మిమిక్రీ డిప్లొమా కోర్సును ఏర్పాటుచేశారన్నారు. అలాగే బి.వి.పట్టాభిరామ్ ఒక హిప్నాటిస్ట్, మెజీషియన్, కౌన్సిలర్, సైకాలజిస్టుగా పేరుప్రఖ్యాతులు గడించి సమాజసేవ చేశారన్నారు. ఇంతగా సమాజసేవకు అంకితమైన వేణుమాధవ్, పట్టాభిరామ్‌లు అజరామరులని, ప్రతికళాకారుడి మధ్య సజీవంగా ఉంటారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో ప్రముఖసంస్థలు కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కిన్నెర 48వ వార్షిక వారోత్సవాల్లో భాగంగా 3రోజుల మాయావినోదం నాటకోత్సవాలు శుక్రవారంరాత్రి రవీంద్రభారతి ప్రధానమందిరంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా.కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ విశిష్ట అతిథులు నేరెళ్ళ శోభావేణుమాధవ్, జయపట్టాభిరామ్, గౌరవ అతిథులు డా.బిఎన్ఎస్.కుమార్, ఎస్.శివారెడ్డి, మర్రి రమేష్, కె.కళాధర్ సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో కలిసి జ్యోతిప్రజ్వలనం చేసి మాయావినోదం-నాటకోత్సవాలను లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. చివరిగా జస్టిస్ బి.కృష్ణమోహన్, రమణాచారి తదితర అతిథుల చేతుల మీదుగా కళాకరులను ఘనంగా సత్కరించారు.

## అంబేద్కర్ వర్శిటీలో ఓటర్ అవగాహన

**జూబ్లీహిల్స్, నవంబరు 7, ప్రభాతవార్తః**
ఎన్నికలపై ఓటర్లను చైతన్య పర్చడం అనే అంశంపై శుక్రవారం ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, ఎలక్షన్ వాచ్ కమిటీ(ఇండియా) జాతీయ అధ్యక్షులు డా. బి. కేశవులుముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈసందర్భంగా అకాడమిక్ డైరెక్టర్ అచార్య జి.పుష్పా చక్రపాణి ఉద్యోగులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. బాధ్యతగల ఓటర్ ఎట్టి పరిస్థితుల్లో ఎలాంటి ప్రలోభాలకు ప్రభావితంకారని, కుల, ప్రాంత, మత, లింగ, భాషాబేధం లేకుండా, ప్రజాస్వామ్యయుతంగా రాజ్యాంగ హక్కుగా సిద్ధించిన ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అన్ని విభాగాల డైరెక్టర్లు, డీన్లు, బోధన, బోధనేతర సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం విశ్వవిద్యాలయంలో ఉద్యోగులంతా ర్యాలీ నిర్వహించి, ప్రజాస్వామ్యాన్ని రక్షించేలా అవగాహన కల్పిస్తామని నినాదాలు చేశారు.

## కెటిఆర్‌ను కలిసిన మహేంద్ర సంఘం ప్రతినిధులు

**చిక్కడపల్లి నవంబరు 7, ప్రభాతావార్త:**
జంటనగరాల మహేంద్రసంఘం అధ్యక్షులు రేషం మల్లేష్ ఆధ్వర్యంలో ప్రతినిధులబృందం శుక్రవారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 11న జరిగే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలలో ఆ నియోజకవర్గంలోని మహేంద్రల మద్దతు బిఆర్ఎస్ పార్టీకే ఉంటుందని కెటిఆర్‌కు భరోసా ఇచ్చారు. జిహెచ్ఎంసి పూర్వ స్టాండింగ్ కమిటీ మెంబర్ శ్రీనివాస్‌రెడ్డి కలిసి సంపూర్ణమద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో సంఘ కార్యవర్గం గురుమూర్తి, రామ్‌కుమార్, నర్సింగ్‌రావు, సతీష్, ప్రసాద్, ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మహిళల సాధికారత క్రీడలలో మహిళా భాగస్వామ్యం అవసరం

**చిక్కడపల్లి, నవంబరు 7, ప్రభాతవార్త:**
మహిళల సాధికారత క్రీడలలో మహిళా భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా తమ లక్ష్యాలకు ప్రేరణ ఇవ్వడంపై దృష్టి ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం క్రీడలు, విశ్రాంతి జీవనోపాధి అవకాశాలను కలుపుకొని మిశ్రమ వినియోగ అభివృద్ధిని సృష్టించడానికి ఓమాక్స్ వంటి సంస్థలు ప్రయత్నాలను మరింత ముందుకు తీసుకువెళ్లే అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా, మెరుగైన క్రీడాసౌకర్యాల ప్రయోజనాలు ఉన్నతక్రీడాకారులకు మాత్రమే కాకుండా మొత్తం సమాజానికి విస్తరిస్తాయని నిర్ధారిస్తుందని అన్నారు. ఇందులోభాగంగానే సమాజ అభివృద్ధి, ఆర్థిక అవకాశాలు దేశనిర్మాణంలో క్రీడలు ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కీలకపాత్రపై తన నమ్మకాన్ని ప్రతిబింబిస్తూ, ఓమాక్స్ భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను తన బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నారన్నారు.

## చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు

**చిక్కడపల్లి, నవంబరు 7, ప్రభాతవార్త:**
చిక్కడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాల సందర్భంగా విశేషపూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్ రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

## విఠోభా మందిరంలో పలువురు పూజలు

**అఫ్జల్‌గంజ్, నవంబరు 7, ప్రభాతవార్త:**
కార్తీ క మాసాన్ని పురస్కరించుకుని జంగల్ విఠోభా దేవాలయంలో ప్రత్యేక పూజ కార్య క్రమాలను నిర్వహించారు. ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజలకు ఆలయ కమిటి నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈకార్యక్రమంలో శ్రీవిఠలేశ్వర బాల భక్తసమాజ్ చైర్మన్ కార్పొరేటర్ గోంటి శంకర్‌యాదవ్, అధ్యక్షులు వి.కిషన్‌యాదవ్, ఆలయపూజారి రాజుమహారాజ్, ప్రధానకార్యదర్శి పి.మాణిక్‌రావు, వి.పాండుయాదవ్, బోయిని వెంకటేష్‌యాదవ్, రఘునందన్‌యాదవ్, శ్యామ్‌యాదవ్, రమేష్‌యాదవ్‌లతోపాటు వందలాది భక్తులు పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ పి.మమత సంతోష్‌గుప్త ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాగా కార్తీకమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం గోషామహల్ నియోజకవర్గంలోని పలు దేవాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలను చేశారు. ఆలయాలను విద్యుత్‌దీపాలతో అత్యంత సుందరంగా ఆలకరించారు. ఆలయాల్లో అంకుట్ అన్నదానం, ప్రసాదాలను అందచేశారు.

## 8న కూచిపూడి నృత్యం, సినీ గీతాలు

**చిక్కడపల్లి, నవంబరు 7, ప్రభాతవార్త:**
ది కాస్మోపాలిటన్ ఎంప్లాయిస్ కల్చరల్ అసోసియేషన్ (సిఈసిఏ) స్వర్ణోత్సవం సందర్భంగా అనన్యమానస కూచిపూడినృత్యం, సినీగీతాలు, మాజిక్‌షో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు అనిల్ వివరించారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో నవంబర్ 8వ తేదీన జరిగే ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రూరల్ ఎలెక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, కేంద్ర ప్రభుత్వ విశ్రాంత కార్యదర్శి ఏం గోపాలకృష్ణ, తెలంగాణ రాష్ట్ర డిజిపి బి.శివధర్‌రెడ్డి, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్వసభ్యుడు టి.వివేక్ పాల్గొంటారన్నారు.

## వైభవంగా 'వందేమాతరం' వార్షిక వేడుకలు

**నార్సింగి, నవంబరు 7, ప్రభాతవార్త:**
గండిపేట మండలంలో స్వాతంత్ర్యోద్యమ గీతం "వందేమాతరం" 150వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కార్యాలయంలో కమీషనర్ శరత్‌చంద్ర, కార్యాలయంలోని 50మంది ఉద్యోగులు వందేమాతరం గీతాన్నిపాడి ఆనందపరవశులయ్యారు. అలాగే నార్సింగి మున్సిపాలిటీలో కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి, మేనేజర్ నాగేంద్రబాబు, ఉద్యోగులు, సిబ్బంది, మణికొండ మున్సిపాలిటీలో కమిషనర్ ప్రదీప్‌కుమార్ ఉద్యోగులు, సిబ్బంది అందరూ కలిసి వందేమాతర వేడుకలను కన్నులపండువగా జరుపుకున్నారు. కిస్మత్‌పూర్ గ్రామంలో సీనియర్ సిటిజన్లు అంతా కలిసి ఒక వద్దకు చేరి వందేమాతరం గీతాన్ని ఆలపించి మురిసిపోయారు. వందేమాతరంపాడితే మా ఒంటిపై ఉన్న రోమాలన్నీ నిక్కబొడుచుకుంటాయని సీనియర్ సిటిజన్లు పేర్కొన్నారు. వందే మాతరం... వందే మాతరం అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈసందర్భంగా కమిషనర్లు కృష్ణ మోహన్ రెడ్డి, శరత్‌చంద్ర, ప్రదీప్‌కుమార్‌లు మాట్లాడుతూ వందేమాతరం నినాదంతోనే భారతీయులంతా ఏకతాటిపైకి చేరారని, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కొదమసింహాల్లా దూకారన్నారు. నాడు అన్నివర్గాల వారిని రవీంద్రనాథ్‌ఠాకూర్ రచించిన వందేమాతరం గీతమే ఐకమత్యంగా ఉద్యమించేలా చేసిందన్నారు. పదేళ్లనుంచి పండు ముదుసలి వాళ్ల వరకు అందరూ వందేమాతరం అంటూ ఆంగ్లేయుల వలస పాలనకు విరుద్ధంగా ఉద్యమించారని గుర్తు చేశారు. వందేమాతరం అంటే ఆనాడు ఆంగ్లేయుల గుండెల్లో రైళ్లు పరుగెత్తేవని, ఎక్కడ వందేమాతరం నినాదంవస్తే అటు వైపు వెళ్లేందుకు తెల్లవారు భయపడిపోయారని తెలిపారు. వందేమాతరం నినాదం, గీతం ఆనాడు ఆసేతుహిమాచలం వరకున్న కోట్లాదిమంది భారతీయులందరిని ఏకంచేసిందని వివరించారు. మొత్తంమీద శుక్రవారం వందేమాతరగీతం, నినాదం మళ్లీ ప్రజలందరూ ఆలపించడం ఆనందంగా ఉందని సీనియర్ సిటిజన్లు పేర్కొన్నారు.

## బాలోత్సవాలు జ్ఞాన వికాస దీపాలు

**చిక్కడపల్లి, నవంబరు 7, ప్రభాతవార్త:**
బాలోత్సవాలు జ్ఞానవికాస దీపాలుగా గత ఐదుసంవత్సరాలుగా వెలుగునందుతున్నాయని సైకియాట్రిస్టు, కౌన్సిలర్, సుధీర్ సండ్ర అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం ప్రాంగణం బాగ్‌లింగంపల్లిలో జరిగిన తెలంగాణ బాలోత్సవం 5వ పిల్లలజాతర కార్యక్రమంలో సుధీర్ సండ్ర ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బాలోత్సవం వేలాది చిన్నారుల ఒక్క స్నేహ సంఘము భవిష్యత్తుపై ఒక కొత్త ఆశలు మోసుకెళ్తుందని, జాతి భవితకైనా భాష మనుగడకైనా పిల్లలే ఆశా దీపాలు అని తెలిపారు. పిల్లలను మార్కులతో కొలువలేము, మూస వార్షికపరీక్షలతో జతకట్టలేమన్నారు. కుంచతో అద్భుతవిన్యాసాలుచేశారు. పద్యాలు వల్లెవేశారు. మట్టితో బొమ్మలుచేశారు. చిత్తుపేపర్లతో అద్భుతమైన క్రాఫ్ట్ బొమ్మలు వేశారు. జానపదం మా ప్రాణపదమంటూ ఎగిరి గంతులేశారు. శాస్త్రీయనృత్యాలతో పిల్లలు నాట్యమయూరాలుగా మారిపోయారు. ఈ కార్యక్రమాలు ముగింపు సభలో భాగంగా తెలంగాణ బాలోత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ప్రదర్శనలు అన్నీ ఆకట్టుకున్నాయని, పసిపిల్లల్లో నిగూఢంగా దాగిన సృజనను వెలికితీసే ఒక ప్రయత్నం జరుగుతోందని తెలిపారు.


భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

# వందేమాతరానికి 150 ఏళ్లు

## గజ్వేల్‌లో జాతీయ జెండాతో భారీ ర్యాలీ

**గజ్వేల్, నవంబరు 7 (ప్రభాతవార్త):** వందేమాతరం గీతానికి 150 ఏళ్ల సందర్భంగా గజ్వేల్‌లో హిందూ, భజరంగ్‌దళ్ వివిధ సంఘాల నాయకుల తో పాటు పలు పాఠశాలల విద్యార్థులు భారీ జాతీయ జెండా పట్టుకొని ఇందిరాపార్కు చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, ఐఓసి కార్యాలయం మీదుగా పలు ప్రధాన రహదారులపై తిరంగా ర్యాలీ నిర్వహించారు. అలాగే పలు ప్రభుత్వ కార్యాలయాల్లో, పోలీస్ స్టేషన్‌లో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. స్వతంత్ర ఉద్యమంలో కోట్లాది మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన వందేమాతర గేయానికి నేటితో 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, హిందూ, భజరంగ్‌దళ్ నాయకులు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, హిందూ, భజరంగ్‌దళ్ నాయకులు, విద్యార్థులు, గజ్వేల్ ఏసిపి నర్సింలు, సిఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ములుగులో...**


వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు

**ములుగు, నవంబరు 7 (ప్రభాతవార్త):** వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ములుగులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వందేమాతర గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**చిన్నశంకరంపేట మండలంలో...**


జడ్పీ పాఠశాలలో వందేమాతరం గీతాలాపన చేస్తున్న విద్యార్థులు

**మెదక్, నవంబరు 7, ప్రభాతవార్త:**
వందేమాతరం గేయం 150 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా చిన్న శంకరంపేట మండల వ్యాప్తంగా పాఠశాలలో, ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతరం గేయాన్ని విద్యార్థులు, ఉద్యోగులు ఆలపించారు. వందే మాతరం గీతాలాపనతో విద్యార్థులు తమ దేశభక్తిని చాటుకున్నారు.

**మర్కుక్ మండలంలో...**


వందేమాతర గీతం ఆలపిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**మర్కుక్, నవంబరు 7 (ప్రభాతవార్త):** వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వందేమాతరంపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాములపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సామూహికంగా వందేమాతరం ఆలపించి 150వ లోగోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లతీసైదా మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని రగిలించి అనేక మంది ఉద్యమకారులకు మార్గదర్శకత్వాన్ని, దిశానిర్దేశాన్ని చేసే అసేతు హిమాచలాన్ని ఏకంచేసి ప్రజల్లో ఐక్యతను రగిలించిన వందేమాతరం 150 వసంత వేడుకలను ఘనంగా జరుపుకున్నామన్నారు. భారతదేశ సస్యశ్యామలతను, వైభవాన్ని, వైభోగాన్ని కీర్తిస్తూ బంకింగ్ చంద్ర చటర్జీ ఆనంద మఠ్ అనే పుస్తకంలో రాసిన గీతానికి పూర్తిస్థాయి అర్థాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**కొమురవెల్లిలో...**


వందేమాతరం గేయాలాపన చేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, నవంబరు 7, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం వద్ద శుక్రవారం వందేమాతరానికి 150 ఏళ్ల సందర్భంగా ఎంపిడివో బండి లక్ష్మప్ప ఆధ్వర్యంలో జాతీయ గేయాలాపన చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాది మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా ఏడాదిపొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 7, ప్రభాతవార్త :** హుస్నాబాద్‌లోని 132/33 కెవి సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతులకు నేడు (శనివారం) విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని ఏడి ఉపేంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల పరిధిలోని గ్రామాలలో ఉదయం 9.30 నిమిషాల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆ ప్రకటనలో ఆయన కోరారు.

## నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**చిన్నశంకరంపేట,నవంబరు 7,ప్రభాతవార్త:** నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ దినకర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా చిన్నశంకరంపేట, సూరారం, ధర్పల్లి, శాలిపేట,మడూర్,గవ్వలపల్లిలోని విద్యుత్తు ఉపకేంద్రాల్లో మరమ్మత్తుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని, రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# అభివృద్ధి పనులను ఫిబ్రవరిలోగా పూర్తి చేయాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజనీర్‌శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఎంజిఎన్‌ఆర్ ఈజీఎస్ కింద మండలాలవారీగా అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాలు, ఎస్‌డిఎఫ్, పిఎంజిఎస్‌వై కింద చేపడుతున్న వైకుంఠదామలు, సీసీ రోడ్డు, పిహెచ్‌సి సబ్ సెంటర్లు, మహిళ సమాఖ్య భవనాలు, మినీ ఫంక్షన్‌హాల్, డ్రైనేజీ ఇతర నిర్మాణాలు, 15వ ఆర్థిక కమిషన్ గ్రాంట్ కింద చేపట్టిన పిహెచ్‌సి సబ్ సెంటర్ నిర్మాణాలు, మేజర్ మైనర్ రిపేర్ల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాస్టర్ జెనరేట్ చేసి ఫిబ్రవరిలోపు అన్ని నిర్మాణంలో గల భవన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. పనులు పూర్తి కాగానే ఎఫ్‌టిఓ జెనరేట్ చేయాలన్నారు. కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఎక్కువ కాలం ఉండే విధంగా నిర్మించేలా పర్యవేక్షణ చేసి సూచనలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ చిరంజీవి, డిఆర్‌డిఎ పిడి జయదేవ్ ఆర్య పాల్గొన్నారు.

### గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

**సిద్దిపేట రూరల్, నవంబరు 7, ప్రభాతవార్త :** ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాలమేరకు ఎలెక్టోరల్ రూపొందించడానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించినట్లు సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్ట హైమావతి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఓటర్ సర్వేకోసం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాల ప్రకారం ప్రజాస్వామ్యంలో ఓటర్ లిస్ట్ అత్యంత పారదర్శకంగా తయారు చేయడానికి నియోజకవర్గంవారీగా ఒక్కో రాజకీయ పార్టీ నుంచి బిఎల్‌ఎస్‌ను అపాయింట్ చేయాలని పార్టీ ప్రతినిధులకు సూచించారు. పోలింగ్ స్టేషన్ వారిగా ఇంటింటి సర్వే నిర్వహించి కొత్త ఓటర్లు, షిఫ్టెడ్ ఓటర్లు, డెత్ ఓటర్ల లిస్ట్‌లను ప్రభుత్వ బిఎల్‌ఓ, రాజకీయ పార్టీల బిఎల్‌ఎస్‌లు కలిసి ఓటర్ లిస్ట్ తయారు చేసి సంబంధిత ఏఈఆర్‌ఓ లేదా ఈఆర్‌ఓకు అందించాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు), వివిధ పార్టీల నాయకులు గయాజుద్దీన్, పవన్, జనార్ధన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్

## ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

### మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 7, ప్రభాతవార్త :** పట్టణంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని మున్సిపల్ కమిషనర్ టి.మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఫంక్షన్ హాల్ యజమానులు, శుభకార్యాలు నిర్వహించే వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ఫంక్షన్ హాల్‌లో ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించాలని, మెప్మా ఆధ్వర్యంలో ఉన్న స్టీల్ బ్యాంకులను వాడుకోవాలని, స్టీల్ వస్తువులను వాడకపోతే ఫంక్షన్ హాల్ నిర్వహలకు రూ.10,000 లేదా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2016, మున్సిపల్ చట్టం 2019, పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, ఫంక్షన్ హాల్ నిర్వాహకులు క్యాస రాము, లక్ష్మారెడ్డి, బి.రాజయ్య, దేవేందర్ రెడ్డి, బత్తిని మహేందర్, కనకయ్య, క్రిస్టయ్య, టిఎఫ్ఎల్ ఆర్పి సమత,జవాన్‌లు సారయ్య, ప్రభాకర్ ఉన్నారు.

## పుస్తెలు, మెట్టెలు అందజేత

**చిన్నకోడూరు, నవంబరు 7, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రంగాయిపల్లి గ్రామంలో పాడి రైతు సందబోయిన మల్లేశం-లక్ష్మీ కూతురు వివాహనికి కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ సతీష్‌రెడ్డి శుక్రవారం పుస్తెలు, మెట్టెలు అందజేశారు. ఈసందర్భంగా సతీష్ మాట్లాడుతూ కరీంనగర్ డెయిరీ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని అందులో భాగంగానే కళ్యాణమస్తు పథకంకింద ఆడబిడ్డపెళ్లికి పుస్తెమట్టెలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు దేవయ్య, కార్యదర్శి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడవద్దు

### ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 7, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో విడుదల చేయకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడుతుందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండల కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్ మండిపడ్డారు. శుక్రవారం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ ఫీజులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో 6 సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న రూ. 8400 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని నాలుగు రోజులుగా ప్రైవేటు డిగ్రీ కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు, మెడికల్ కళాశాలలు, బంద్ చేసి నిరసన వ్యక్తం చేసినా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కిషోర్, మహేష్,రాజు,నవీన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



150 సంవత్సరాల సంఖ్యను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

## రామంచలో ఘనంగా వందేమాతరం ఉత్సవాలు

### 150 ఆకృతిలో ఆకట్టుకున్న విద్యార్థులు

**చిన్నకోడూరు, నవంబరు 7, ప్రభాతవార్త :** వందేమాతరం 150 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా మండల పరిధిలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో వందేమాతరం గేయాన్ని సామూహికంగా ఆలాపించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో 150 సంవత్సరాల జ్ఞాపకంగా సంఖ్యను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు అబేధా బేగం, సునీత, నాగమణి, వరప్రసాద్, స్వరూప, విద్యార్తులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతు చేసిన బిజెపి నాయకులు


గుంతల రోడ్డును మరమ్మతు చేస్తున్న బిజెపి నాయకులు

**గజ్వేల్, నవంబరు 7 (ప్రభాతవార్త):** ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రహదారి మధ్యలో గుంతలుపడడంతో శుక్రవారం బిజెపి నాయకులు రోడ్డు మరమ్మతు చేపట్టారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు ఉదయం నుండి మధ్యాహ్నం వరకు గుంతలలో డస్ట్ పోయించి మరమ్మతు చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ గజ్వేల్‌లో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్డు దెబ్బతిన్నదని స్థానిక అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. దీంతో బిజెపి నాయకులందరం కలిసి చందాలు వేసుకొని రోడ్డు మరమ్మతు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కమ్మరి శ్రీను, సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నత్తి శివకుమార్, చెప్యాల వెంకట్‌రెడ్డి, నాయిని సందీప్‌కుమార్, బారు అరవింద్, పట్టణ ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి ప్రసాద్, చెన్నోజి నీరజ, మహిళా మోర్చా అధ్యక్షురాలు కుంకుమరాణి, ఎల్లా బాబు, కొమ్ము అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

**చేర్యాల, నవంబరు 7,ప్రభాతవార్త :**
సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చేర్యాల ఎస్సై నవీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముస్త్యాల గ్రామ శివారులోని ప్రగతి విద్యనికేతన్ ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులకు మైనర్ డ్రైవింగ్ గురించి,మహిళల రక్షణకు ఉన్న చట్టాలు,సైబర్ నేరాలు,గంజాయి ఇతర మత్తు పదార్థాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నవీన్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి మాసపోవద్దని తెలిపారు. చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య ఏఎస్ఐ,మహిళా కానిస్టేబుళ్ల ప్రశాంతి, స్వప్న, కానిస్టేబుళ్లు కృష్ణ, బాబు, తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నకు నేస్తం 'నాణ్యమైన విత్తనం'

### జిల్లా నోడల్ అధికారి, శాస్త్రవేత్త రాహుల్


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

**నర్సాపూర్ రూరల్, నవంబరు 7, ప్రభాతవార్త:**
నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం అని జిల్లా నోడల్ అధికారి శాస్త్రవేత్త కె.రాహుల్ విశ్వకర్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మాదాపూర్ గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో వరి పంటపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారి శాస్త్రవేత్త కె.రాహుల్ విశ్వకర్మ వరిపంటకి సంబంధించి ఎమ్‌టీయూ-1010.. రకాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ ఈ నాణ్యమైన విత్తనంతో పంటలు సమృద్ధిగా పండించి తద్వారా దేశ సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలనే మహోత్తర లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ప్రతి మండలంలో ప్రతి రెవెన్యూ గ్రామానికి విత్తన కిట్లు అందించినట్లు తెలిపారు. ఈ నాణ్యమైన విత్తనాలను రైతులు పొలాల్లో పండించి తద్వారా పండిన విత్తనాల్ని ఇతర రైతులకు చేరవేసేలా చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. ఇది విత్తన లభ్యతను పెంచడమే కాకుండా నాణ్యమైన విత్తనంపై అవగాహన కల్పించడానికి దోహదపడుతుందన్నారు. అలాగే రైతులకు అవసరమైన సూచనలు, సమస్యలకు సత్వరమే పరిష్కారం లభిస్తుందని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి కే.దేవ్ కుమార్ మాట్లాడుతూ ఈ విత్తనాన్ని ఒక రైతు నుండి మరొక రైతులకు ఇవ్వడం ద్వారా మంచి లాభాలు, నాణ్యమైన విత్తనాన్ని పొందవచ్చు అని తెలిపారు. మండల మానిటరింగ్ అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ ఈ విత్తనాన్ని సురక్షితమైన ప్రదేశంలో నిల్వ చేసుకొని వచ్చే సీజన్ కి వాడవచ్చు అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు, నర్సాపూర్ సంధ్యరాణి, మండల వ్యవసాయ అధికారి దీపిక, ఏవో శ్రీదేవి, వ్యవసాయ విస్తరణ అధికారులు రుతు,లక్ష్మీ, తేజస్విని, ఏటీఎం హరీష్, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం యంగ్ ప్రొఫెషనల్ -1 ఎస్. శ్రీకాంత్,ఆకాష్, గ్రామ రైతులు తిరుపతిరెడ్డి, లచ్చయ్యా, కరీం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు

## విద్యార్థులకు క్విజ్ పోటీలు

**హుస్నాబాద్‌టౌన్, నవంబరు 7, ప్రభాతవార్త :** ప్రతీ విద్యార్థి సర్ సివి రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సర్ సివి రామన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాయిత నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం 150 వసంతాల వందేమాతరం ఉత్సవం, సి.వి. రామన్ జయంతి వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్విజ్ పోటీలు ఉద్యోగాల సాధనకు తోడ్పడతాయన్నారు. భారతదేశానికి నోబెల్ ప్రైజ్ ద్వారా కీర్తిని చాటిన చంద్రశేఖర వెంకటరామన్ జయంతిని అందరితో జరుపుకోవడం సంతోషకరం అన్నారు. అనంతరం నిర్వహించిన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

**మర్కుక్‌లో...**


విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**మర్కుక్, నవంబరు 7 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ప్రధానోపాధ యుల సంఘం, టి సాట్ ఆధ్వర్యంలో 6 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మూడు రకాల క్విజ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో వెంకటరాములు క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. క్విజ్ పోటీలో ఉపన్యాసంలో 9వ తరగతికి చెందిన వర్షిత, వ్యాసరచనలో దామరకుంట జెడ్‌పిహెచ్‌ఎస్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని వైష్ణవిలు ప్రథమ బహుమతి సాధించారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రతిభా పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

**అక్కన్నపేట, నవంబరు 7, ప్రభాతవార్త :** టిసాట్, తెలంగాణ స్టేట్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్విజ్, ఉపన్యాస, వ్యాసరచన పోటీలను శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో నిర్వహించారు. ఈ పోటీల ముగింపు సమావేశంలో నిర్వాహకులు, బాదావత్ చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కోశాధికారి, సంధ్యారాణి, ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పోటీలు విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి ఉపయోగపడతాయన్నారు. అనంతరం క్విజ్ పోటీలో మొదటి స్థానంలో నిలిచిన పి.వంశీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంతకపేట, ఉపన్యాస పోటీలో ప్రథమ స్థానం బి.అంజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అక్కన్నపేట, వ్యాసరచన పోటీలో మొదటి స్థానం ఎస్ జాహ్నవి, కేజీబీవీ అక్కన్నపేట విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపి వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతకింది శ్రీనివాస్, శంకర్‌నాయక్, వెంకటదాస్, సుధాకర్, సంధ్య, సరీరాం జక్కల్, చిత్తరంజన్, రవికుమార్, రాజేంద్రప్రసాద్, సంపత్, రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

## ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ


వార సంతలో ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న విద్యార్థుల దృశ్యం

**హుస్నాబాద్‌టౌన్, నవంబరు 7, ప్రభాతవార్త :** హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో సహస్ సిజిఐ అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో పట్టణంలో జరిగే శుక్రవారం వార సంతను వలంటీర్లు సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ బ్యాగులు వాడకూడదని అవగాహన ర్యాలీని నిర్వహించారు. ప్లాస్టిక్ సంచుల వల్ల కలిగే అనర్థాలను వ్యాపారులకు, వినియోగదారులకు వివరించారు. బట్టతో తయారు చేసిన సంచులను, జనపనార సంచులను చూపిస్తూ కూరగాయలను కొనాలన్నా, అమ్మాలన్న ఇలాంటి సంచులను ఉపయోగించాలని వివరించారు. "ప్లాస్టిక్ కవర్లు వద్దు బట్ట సంచులే ముద్దు", "ప్లాస్టిక్ ని తరిమేద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం", "బట్ట సంచులను వాడదాం నేల తల్లిని కాపాడుదాం" అంటూ విద్యార్థులు చేసిన స్లోగన్‌లు పలువురిని ఆలోచింపచేసాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ బి నైనాదేవి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు బాలరాజు, సంపత్, వినీత్, శ్రవణేష్ పాల్గొన్నారు.

## స్వామి వారిని దర్శించుకున్న బిసి కమిషన్ చైర్మన్, సభ్యులు

**కొమురవెల్లి, నవంబరు 7, ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామిని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు టి.సురేందర్ శుక్రవారం కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఈవో వెంకటేష్ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు సురేందర్‌లను ఘనంగా సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, సిబ్బంది, తహశీల్దార్, ఎస్ఐ రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకున్న బిసికమిషన్ చైర్మన్, సభ్యుల దంపతులు

## దత్తగిరి ఆశ్రమంలో శోభాయమానంగా మృత్యుంజయ యజ్ఞం

**-యజ్ఞంలో పాల్గొని పునీతులైన భక్తులు**

**ఝరాసంగం, నవంబరు 7, ప్రభాతవార్త:**
సమాజంలోని సమస్త ప్రాణకోటికి మృత్యుభయం తొలిగి ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని వేడుకుంటూ మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామంలోని దత్తగిరి ఆశ్రమంలో ఆశ్రమ పీఠాధిపతులు వైరాగ్య శిఖామణి 1008 అవధూత గిరిమహారాజ్ (అప్పగారు), డాక్టర్ సిద్దేశ్వర మహారాజ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం మృత్యుంజయ లక్షజపయజ్ఞం శోభాయమానంగా నిర్వహించారు. ఆశ్రమ ఆవరణలో గణపతిపూజ, గోపూజ, రుద్రాభిషేకం పూజలతో కార్యక్రమాలకు ఆంకురార్పణచేసి యజ్ఞాలకు అంకురార్పణచేశారు. ఈసందర్భంగా ఆశ్రమ పీఠాధిపతులు మాట్లాడుతూ ఇటీవల తెలుగురాష్ట్రాలలో రోడ్డుప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో అనేకకుటుంబాలు రోడ్డుపాలవుతున్నాయని, రోడ్డుప్రమాదాల నివారణకు పరమేశ్వరుడికి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పూజాకార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం పూర్ణాహుతి నిర్వహించి మంగళహారతితో ముగించారు. విశ్వమానవధర్మ ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం ప్రతిమాసం యజ్ఞాలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ పీఠాధిపతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ దేవూజా, తహసీల్దార్ తిరుమలరావు, శివశక్తి జాతీయ ప్రధానకార్యదర్శి కళ్యాణ్‌కుమార్, జిల్లా అధ్యక్షులు ఠాకూర్ శివకుమార్, జిల్లా సమన్వయకర్త ఎంపి శ్యామ్‌రావు, ఉత్సవ కమిటీ సభ్యులు, జహీరాబాద్ డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయులతో ఎంఈఓ సమావేశం



ప్రధానోపాధ్యాయునితో సమావేశం అయిన ఎంఈఓ

**రామచంద్రాపురం, నవంబరు 7, ప్రభాతవార్త:**
మండలంలోని ఆయాగ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల విద్యాధికారి సెయింట్ ఆర్నాల్డ్స్ పాఠశాలలో జూమ్ మీటింగ్ ద్వారా సమావేశం అయ్యారు. ఈసందర్భంగా యుడిసెట్ ఫారాన్ని నింపే విధానంపై ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ అవగాహన కల్పించారు. పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయుల, విద్యార్థుల సమాచారము, పాఠశాల భవనానికి సంబంధించిన కచ్చితమైన సమాచారం ఇవ్వాలని సూచించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల సమాచారంతోపాటు విద్యార్థుల వ్యక్తిగతప్రగతి సమాచారం, 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన సమాచారాన్ని యూడైస్ ఫారమ్‌తో నింపి ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ప్లానింగ్ అధికారి తాజోద్దీన్‌లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలిపినట్లు మండల విద్యాధికారి పిపి రాథోడ్ తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు సురేన్, వెంకటయ్య, కార్యాలయ సిబ్బంది ధనలక్ష్మి, సుజాత, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## మనూర్‌లో ప్రారంభమైన దర్గా జాతర

**మనూర్, నవంబరు 7, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన మనూర్‌లో యాదుల్లా హుస్సేన్ దర్గా ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దీపారాధన, కవ్వాలి కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలకు మనూర్ గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పాల్గొని దర్గాను దర్శించుకున్నారు. దర్గాకు చేరుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

## ప్రపంచ మానవాళి విముక్తికి సోషలిజమే మార్గం




ఫోటో:7ఎస్ఆర్‌డి21,మాట్లాడుతున్న సిపిఎం నాయకులు మాణిక్

**కొండాపూర్, నవంబరు 7, ప్రభాతవార్త:**
ప్రభుత్వాలుమారినా, రాజ్యాలుమారినా దోపిడీలేని సమసమాజ నిర్మాణానికి మార్గంచూపిన సోవియట్ రష్యా అక్టోబర్ మహా విప్లవం అని, ప్రపంచానికి దోపిడీలేని సమాజం సాధ్యమని ఆచరణాత్మకంగా రుజువు చేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్ అన్నారు. శుక్రవారం కొండాపూర్ మండలకేంద్రంలో అక్టోబర్ మహావిప్లవం సోషలిజం ఆవశ్యకత పైన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1917 నవంబర్ 26న సోషలిస్టు విప్లవం విజయం సాధించిందని అన్నారు. అక్టోబర్ విప్లవం ప్రపంచవ్యాప్తంగా కార్మిక ఉద్యమాలు, వలస వ్యతిరేక పోరాటాలు జరిగాయని అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభాల పుట్ట అని, పరిష్కారం చూపలేదని అన్నారు. దోపిడీలేని వ్యవస్థ సోషలిజం ప్రత్యామ్నాయమని అన్నారు. దేశానికి కేరళ వామపక్ష ప్రభుత్వమే ఆదర్శమని అన్నారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి కె.రాజయ్య, జిల్లా నాయకులు అశోక్, మండలకమిటీ సభ్యులు బాబురావు, ప్రవీణ్, నాయకులు శివకుమార్, ప్రశాంత్, రాజు, రమేష్, శేఖర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివి విద్యార్థినులకు జాతీయస్థాయి అవకాశం



సర్టిఫికేట్‌లు పొందిన విద్యార్థులు

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబరు 7, ప్రభాతవార్త:**
కస్తూర్బాగాంధీ బాలికావిద్యాలయం (కెజిబివి) నిజాంపేట్‌కు చెందిన 32 మంది విద్యార్థినులు స్కౌట్స్ గైడ్స్ రాష్ట్రస్థాయి సర్టిఫికెట్లు పొందారు. పిటి టీచర్ జ్యోత్స్న మార్గదర్శకత్వంలో ఈవిద్యార్థినులు జాతీయస్థాయికి ఎంపికయ్యారు. నవంబర్ 20నుంచి డిసెంబరు 3వరకు ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగే నేషనల్ ప్రదర్శనల్లో పాల్గొననున్నారు. ఈసందర్భంగా కెజిబివి ప్రత్యేక అధికారి రాణి సర్టిఫికెట్లు పొందిన విద్యార్థినులను, పిటి జ్యోత్స్నను అభినందించారు.

## ఆర్గానిక్ వ్యవసాయంతో ఆరోగ్యానికి మేలు

**-వంగ రాజేశ్వర్‌రెడ్డి**

**నంగునూర్, నవంబరు 7, ప్రభాతవార్త:**
అర్గానిక్ వ్యవసాయం మానవ ఆరోగ్యానికి మేలుచేస్తుందని యువ నాయకుడు వంగ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలపరిధిలోని ముంద్రాయిగ్రామంలో వంగ రాజేశ్వర్‌రెడ్డి వ్యవసాయక్షేత్రాన్ని ది మాస్టర్‌మైండ్స్ స్కూల్ విద్యార్థులు ఆర్గానిక్‌వ్యవసాయంపై అవగాహనకోసం శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక వ్యవసాయం ఎక్కువగా రసాయనికమందులపై ఆధారపడుతుందని ఇది ఆరోగ్యానికి హానికరమన్నారు. గత 4యేళ్ల నుంచి తాము భవిష్యత్ తరాల ఆరోగ్యాన్ని దృష్టిలోపెట్టుకొని ఆర్గానిక్ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామగ్రామాన వందేమాతర గీతాలాపన



చౌటకూరు వందేమాతరం గీతాలాపన



కందిలో వందేమాతరం గీతాలాపన



నాగల్‌గిద్దలో వందేమాతరం గీతాలాపన



పుల్‌కల్‌లో వందేమాతరం గీతాలాపన



న్యాల్‌కల్‌లో వందేమాతరం గీతాలాపన



వందేమాతరం గీతాలాపన



మాట్లాడుతున్న ఎంఈఓ, ఎస్సై




సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థులు



మంజీరా విద్యాలయంలో వందేమాతరం గీతాలాపన



పాపన్నపేటలో వందేమాతరం గీతాలాపన

**చౌటకూరులో...**

**చౌటకూరు, నవంబరు 7, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూరులోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రెవిన్యూ కార్యాలయ ఆవరణలో విద్యార్థులు, అధికారులు వందేమాతర గీతాన్ని సామూహికంగా ఆలపించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీమాన్‌రాజ్, డాక్టర్ సబిత, ఫార్మసిస్ట్ నరసయ్య, విశాల్, ఎంపిఓ స్వర్ణ పార్కల రామ్‌రెడ్డి, ఎస్ఎన్ఓ అజీమ్, భాస్కర్, జిపిఎలు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**కందిలో...**

**వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపిస్తున్న విద్యార్థులు తదితరులు...**

**కంది, నవంబరు 7, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన కందిలోని లక్ష్మీనగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి వందేమాతర గీతాన్ని సామూహికంగా ఆలపించారు. మండలపరిధిలోని ఆయాగ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతోపాటు ఆయా ప్రభుత్వకార్యాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో గీతాన్ని సామూహికంగా ఆలపించారు.

**నాగల్‌గిద్దలో...**

**నాగల్‌గిద్ద, నవంబరు 7, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన నాగల్‌గిద్దతోపాటు మండలంలోని ఆయాగ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద సామూహికంగా వందేమాతర గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**పుల్‌కల్‌లో...**

**పుల్‌కల్, నవంబరు 7, ప్రభాతవార్త:**
ఉమ్మడిపుల్‌కల్ మండలంలో శుక్రవారం వందేమాతరం గీతాన్ని పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో సామూహికంగా ఆలపించారు. కార్యక్రమంలో పుల్‌కల్ తహసీల్దార్ కృష్ణ, మండల విద్యాధికారి శంకర్, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

**న్యాల్‌కల్‌లో...**

**న్యాల్‌కల్, నవంబరు 7, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తోపాటు మండలంలోని ఆయాగ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, కళాశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో సామూహికంగా వందేమాతర గీతాన్ని ఆలపించారు. న్యాల్‌కల్‌లో జరిగిన కార్యక్రమంలో న్యాల్‌కల్ సొసైటీ అధ్యక్షులు మడపతి సిద్దలింగయ్యస్వామి, పంచాయతీకార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**వందేమాతరం గీతాలాపనలో బిజెపి నాయకులు...**

**పెద్దశంకరంపేట, నవంబరు 7, ప్రభాతవార్త:**
పెద్దశంకరంపేటలోని సంస్కార్ విద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వందేమాతరం గీతాలాపనలో మండల బిజెపి నాయకులు పాల్గొన్నారు. విద్యార్థులతో పాటు సామూహికంగా కలిసి జాతీయ జెండాను చేత పట్టుకొని వందేమాతరం గీతాలాపన చేశారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా బిజెపి నాయకులు కోణం విట్టల్. మండల బిజెపి ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణ, బిజెవైఎం మండల అధ్యక్షుడు బొగుడాల కృష్ణ, నాయకులు భూషణం, సురేష్, అనిల్, సాయికుమార్, సంస్కార్ విద్యాలయ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**చిలిపిచెడ్...**

**చిలిపిచెడ్, నవంబరు 7, ప్రభాతవార్త:**
జిల్లాపరిషత్తు పాఠశాల సోమక్కపేటలో బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం గేయంలో పొందుపరచబడిన గొప్ప విషయాలు గురించి తెలుసుకోవడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామయువకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

**శాంతినికేతన్‌లో...**

**సదాశివపేట, నవంబరు 7, ప్రభాతవార్త:**
సదాశివపేటలోని శాంతినికేతన్ విద్యాలయంలో విద్యార్థులను 150ఆకారంలో కూర్చోబెట్టి జాతీయ, దేశ భక్తిని చాటుకున్నారు. జాతీయగేయాన్ని రచించిన బంకించంద్ర ఛటర్జీని స్మరించుకొన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సుప్రియ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

**మంజీరా విద్యాలయంలో...**

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబరు 7, ప్రభాతవార్త:**
స్థానిక మంజీరా విద్యాలయంలో స్థానిక ఎస్సై బాలరాజు, పోలీస్ సిబ్బంది విద్యార్థినీవిద్యార్థులతో కలిసి వందేమాతరాన్ని ఆలపించడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్, కరస్పాండెంట్ జితేందర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

**పాపన్నపేటలో...**

**పాపన్నపేట, నవంబరు 7, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో వందేమాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమం పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం వెంకటేశం ఆధ్వర్యంలో కొనసాగింది, ఇందులో పాఠశాల విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, భట్టు నాగరాజు, రియాజ్, మోహన్‌రావు, వేణుగోపాల్‌రెడ్డి, రవికాంత్, సుభాష్ పద్మ, జాకీర, రజితలక్ష్మి, తదితరులతో పాపన్నపేట పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విశ్వవిజేతగా భారత్‌ను నిలుపుదాం

**-డిఎస్పి వెంకట్‌రెడ్డి**



మాట్లాడుతున్న డిఎస్పి వెంకట్‌రెడ్డి

**నారాయణఖేడ్, నవంబరు 7, ప్రభాతవార్త:**
స్వాతంత్ర ఉద్యమ పోరాటంలో 150 ఏళ్ల క్రితమే వందేమాతర గీతం దేశ ప్రజలను సమైక్యత పరిచిందని అదేస్ఫూర్తితో భారతదేశాన్ని విశ్వవిజేతగా నిలపాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డిఎస్పి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జడ్పిహెచ్ఎస్ నారాయణఖేడ్ పాఠశాల విద్యార్థులతో పొట్టిశ్రీరాములు చౌరస్తాలో వందేమాతర గీతాలాపన అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు చంద్రశేఖర ఆచార్య సౌజన్యంతో స్వామి వివేకానంద రచించిన భారతజాతికి నాహితవు అనే పుస్తకాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనదేశ సంస్కృతీసంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ఎన్నో దేశాలకు మనదేశ నాయకుల పోరాటం స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో ప్రతిపౌరుడు ముందుండాలని అందుకు దేశవనరులను కాపాడడానికి ప్రతినిత్యం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొగి సాయిసంగమేశ్వర్, జోన్ చైర్మన్ రాజ్‌కుమార్, డిస్టిక్ చైర్‌పర్సన్ చంద్రశేఖర్ ఆచార్య, పాఠశాల ఉపాధ్యాయులు యాదగిరి, రాజశేఖర్, రాజయ్య, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పనులు ప్రారంభించని ఇందిరమ్మ ఇళ్లు రద్దు

**-ఎంపిడివో షాకిర్‌అలీ**



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సమీక్షిస్తున్న ఎంపిడివో

**పెద్దశంకరంపేట, నవంబరు 7, ప్రభాతవార్త:**
ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకాబడి ఇప్పటివరకు పనులు ప్రారంభించని ఇందిరమ్మ ఇళ్లను రద్దుచేయనున్నట్లు ఎంపిడివో షాకీర్ అలీ తెలిపారు. శుక్రవారం మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. నేటినుంచి వారంరోజులపాటు లబ్దిదారులకు పనులు ప్రారంభించేందుకు గడువు ఇస్తున్నట్లు తెలిపారు. అప్పటివరకు కూడా లబ్దిదారులు ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభించకపోతే వాటిని రద్దుచేయనున్నట్లు పేర్కొన్నారు. ఈవిషయాన్ని లబ్దిదారులకు తెలపాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నగేష్ శెట్కార్

**మనూర్, నవంబరు 7, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని పుల్‌కుర్తిగ్రామానికి చెందిన మాజీసర్పంచ్ వైజనాథ్ కుమారుడి వివాహవేడుకల్లో ఉమ్మడిమెదక్ జిల్లా ప్రణాళికాసంఘం మాజీసభ్యులు నగేష్‌కుమార్ శెట్కార్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వైజనాథ్ కుటుంబసభ్యులకు శుభాకాంక్షలుతెలిపారు. కార్యక్రమంలో నాగల్‌గిద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్‌రావుపాటిల్, కాంగ్రెస్ నాయకులు పోతుల సంగారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నందు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్ ఈ ప్రభుత్వానికి పట్టదా?

**-ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎర్రోల్ల మహేష్**
**-జోగిపేటలో విద్యార్థులతో ర్యాలీ, ధర్నా**




తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

**జోగిపేట, నవంబరు 7, ప్రభాతవార్త:**
రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవితవ్యాన్ని పూర్తిగా విస్మరిస్తుందని, వారికి ఎన్నికలే ముఖ్యంగా మారాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎర్రోల్ల మహేశ్ విమర్శించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, పెండింగ్‌స్కాలర్‌షిప్స్ పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జోగిపేటలో విద్యార్థులతో భారీర్యాలీనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు రాకపోవటంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, అయినా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లుకూడా కావటంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారమే పరమావధిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోటికొచ్చిన హామీలిస్తున్నారే తప్ప ఆచరణలోమాత్రం పూర్తిగా విఫలమౌతున్నారన్నారు. జుబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సాక్షాత్తూ ముఖ్యమంత్రి విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తామని పేర్కొంటున్నారని, మరి ఇక్కడ విద్యార్థులు పెండింగ్‌నిధులు విడుదల కాక నానా అవస్థలుపడుతుంటే ఎక్కడ ఉన్నతమైన విద్యను విద్యార్థులకు అందిస్తున్నారో తెలపాలని ఆయన ప్రశ్నించారు. విద్యార్థులకు తమ సర్టిఫికేట్లు అందక రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపడుతుంటే రాష్ట్రప్రభుత్వం ఆసమస్యను పరిష్కరించాల్సిందిపోయి, ఆందోళనలు అణచివేసే కుట్రలకు పాల్పడుతుందని విమర్శించారు. కాంగ్రెస్‌ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లుతెరచి విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. అంతకుముందు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు విద్యార్థులతో భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ధర్నానిర్వహించి, తహసీల్దారుకు మెమోరాండం అందచేశారు. ఎస్ఎఫ్ఐ అందోలు డివిజన్ అధ్యక్షకార్యదర్శులు నాని, నిఖిల్, శంకర్, నాయకులు శ్రీనివాస్, నర్సింలు, రాజు, రాకేష్, సందేశ్, మమత, కవిత, అనిత, మల్లీశ్వరి, అఖిల్, నవనీత కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రేషన్ షాపును తనిఖీ చేసిన తహసీల్దార్



తొగర్‌పల్లిలో రేషన్ షాపును తనిఖీ చేస్తున్న తహసీల్దార్

**కొండాపూర్, నవంబరు 7, ప్రభాతవార్త:**
కొండాపూర్ మండల పరిధిలోని తోగర్‌పల్లి గ్రామంలో శుక్రవారం రేషన్ షాప్‌ను స్థానిక తహసీల్దార్ అశోక్ ఆకస్మిక తనిఖీ చేశారు. రేషన్ డీలర్ ప్రభాకర్‌ను అడిగి వివరాలను తెలుసుకున్నారు.

## కాంగ్రెస్‌నేత సహకారంతో రోడ్డుపై గుంతల పూడ్చివేత



రోడ్డుపై గుంతలను పూడ్పిస్తున్న ఎస్ఐ దోమ సుజిత్

**న్యాల్‌కల్, నవంబరు 7, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని జహీరాబాద్-బీదర్ రోడ్డుపై ఏర్పడిన గుంతలతో తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో డిసిసి ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి స్పందించి గోతుల మూసివేతకు నడుం బిగించారు. రోడ్డుపై ఏర్పడ్డ గుంతలలో ఎస్ఐ దోమ సుజిత్ దగ్గరుండి కంకరతో గుంతలను పూడ్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించిన డిసిసి ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి భాస్కర్‌రెడ్డిని ఎస్ఐ దోమ సుజిత్ ప్రత్యేకంగా అభినందించారు.

## కలివేములలో ధాన్యం కొనుగోలు కేందం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిఆర్‌డిఎ పిడి జ్యోతి

**కంది, నవంబరు 7, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని కలివేములగ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం డిఆర్‌డిఎ పిడి జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిడి జ్యోతి మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించినధాన్యాన్ని కొనుగోలుకేంద్రానికి తరలించి మద్దతుధరను అందుకోవాలని సూచించారు. ధాన్యాన్ని మధ్య దళారులకు అమ్ముకుని రైతులు ఆగం కావద్దన్నారు. రైతులకు గోనెసంచులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఇందిరా క్రాంతి పథకం ఎపియం డిపిఎం రమేష్, ఎపిఎం శివలక్ష్మి, మహిళా సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.